క్లుప్తంగా

కంటి శిబిరం ప్రారంభం



నిజామాబాద్ సిటీ: నగరంలోని ముబారక్‌నగర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ యమున గురువారం ప్రారంభించారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని గ్రామస్తులు, డివిజన్ వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ కోరారు. మెడికల్ ఆఫీసర్ ఆసిస్, అంకిత, తదితరులు పాల్గొన్నారు.

ట్రెసా అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం



సుభాష్‌నగర్: తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, కార్యదర్శి ప్రశాంత్‌కుమార్‌ను వీఆర్‌ఏ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. వీఆర్‌ఏలకు పేస్కేల్, 55 ఏళ్లు నిండిన వీఆర్‌ఏల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం, తదితర హామీల అమలుకు కృషి చేసినందుకుగాను వారిని సన్మానించినట్లు వీఆర్‌ఏ జేఏసీ చైర్మన్ దయాసాగర్ తెలిపారు. ఈసందర్భంగా వీఆర్‌ఏల క్రమబద్ధీకరణలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరిస్తూనే, వారి సందేహాలను నివృత్తి చేశారు. జేఏసీ ప్రతినిధులు రాజ్ గణేష్ దీపక్, వేముల సాయన్న, సుమన్, ఆయా డివిజన్ల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

చిన్నారులకు స్వర్ణామృత ప్రాశనం పంపిణీ




మోపాల్(నిజామాబాద్‌రూరల్): నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో స్వర్ణామృత ప్రాశన మందును గురువారం పంపిణీ చేశామని ఆలయ ధర్మకర్త నర్సింహారెడ్డి తెలిపారు. 0–15 వయస్సుగల పిల్లలకు దివ్యౌషధం 9 ఏళ్లుగా ఉచితంగా దాదాపు 3 లక్షల మందికి ఇచ్చామని పేర్కొన్నారు. ప్రతి మాసంలో వచ్చే పుష్యమి నక్షత్రం రోజు నెలకు ఒక్కసారి మాత్రమే ఇస్తామన్నారు. ఔషధం తీసుకున్న పిల్లల్లో రోగ నిరోధకశక్తి పెరగడంతో పాటు చలాకీగా ఉండటం చూశామని నర్సింహారెడ్డి అన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రోహిత్ కుమారాచార్య, ప్రతినిధులు రమేష్, నర్సారెడ్డి, రవీందర్ యాదవ్, నరాల సుధాకర్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



నిజామాబాద్‌నాగారం: ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని కలిగించే సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రముఖ కవి, తెలంగాణ రాష్ట్ర రచయితల సంఘం అధ్యక్షుడు నాశేశ్వరం శంకర్ అన్నారు. ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. నిరంతరం సామాజిక కార్యక్రమాలు చేస్తూ అందరికి ఆదర్శంగా వీరి సేవలు నిలుస్తున్నాయని కొనియాడారు. తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. మనస్సుని కదిలించే కార్యక్రమాలని, నిత్యాన్నదానం చేయడం, విధివంచితులకి సపర్యలు చేయడం గొప్ప విషయమన్నారు. సంస్థ సభ్యులు నాశేశ్వరం శంకర్‌ని శాలువాతో సన్మానించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, గౌరవ అధ్యక్షులు ముస్కు రామేశ్వర్ రెడ్డి, దారం గంగాధర్, చందా జగన్మోహన్, తోగర్ల సురేష్ పాల్గొన్నారు .

ఓట్ల శాతంపై సర్వే



నిజామాబాద్‌నాగారం: ఎన్నికల బృందం అధికారి వేణుమాధవ్ ఆధ్వర్యంలో సర్వే కొనసాగు తోంది. నిజామాబాద్ నగరంలో ఏ ప్రాంతంలో ఓటింగ్ ఎక్కువ శాతం నమోదైంది.. ఏ ప్రాంతంలో ఓటింగ్ శాతం తక్కువ నమోదైంది.. తదితర పూర్తి వివరాలతో ఇంటింటికి తిరుగుతూ సర్వే చేపట్టారు. పూర్తి నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పిస్తామని అధికారులు వెల్లడించారు. మరో రెండు రోజులపాటు ఈ సర్వే కొనసాగుతుందన్నారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి శూన్యం

- కేసీఆర్ ప్రధాని అయితే మనకే గర్వకారణం
- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్



చెక్కులు పంపిణీ చేసిన ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి శూన్యమని, దేశం ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, అమలు కాని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. గురువారం నగరశివారులోని రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మోపాల్ మండలానికి చెందిన 83 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 12 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి గతంలో ఎవరూ చేయలేదని పేర్కొన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలు ఇస్తున్నారని, మహిళలపై సీఎం కేసీఆర్‌కు అపార నమ్మకముందని, వారి మద్దతుతోనే మరోసారి రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలు సీఎం, స్థానిక ఎమ్మెల్యేలను బదనాం చేస్తున్నాయని విమర్శించారు. ఉచితాలకు ప్రధాని మోదీ వ్యతిరేకమని, బీజేపీ కార్పొరేట్లకు కొమ్ముకాస్తుందని, రుణాలు ఎగ్గొట్టే వారికి రూ.13 లక్షల కోట్లు మాఫీ చేసిందని ఆరోపించారు. అప్పులు చేసి పథకాలు కొనసాగిస్తున్న మాట వాస్తవమేనని, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఏం చేశారని రూ.100 లక్షల కోట్లు అప్పులయ్యాయని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. కేసీఆర్ ప్రధాని అయితే మనకే గర్వకారణమన్నారు. ఎంపీపీ లతా కన్నీరాం, రైతు సమితి అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ లత, ఆర్ఐ రాజేశ్వర్, స్థానిక ప్రజాప్రతినిధులున్నారు.

బీజేపీ కార్యకర్త కుటుంబానికి..

కంజర్ గ్రామంలో ఓ బీజేపీ కార్యకర్త కుటుంబానికి బాజిరెడ్డి గోవర్ధన్ కల్యాణలక్ష్మి చెక్కు అందజేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మనందరిదని, సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అందాలన్నదే కేసీఆర్ అభిమతమని పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తలు, వారి కుటుంబసభ్యులు పునరాలోచించి, బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు.

ప్రహరీకి నిధులు మంజూరు చేయాలని వినతి

సిరికొండ: గడ్కోల్‌లో పెద్దమ్మ ఆలయం వద్ద ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు ముదిరాజ్ సంఘం సభ్యులు విన్నవించారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యేను వారు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపసర్పంచ్ కొమ్మెటి రవీందర్, సభ్యులు పరమేశ్వర్, స్వామి, లింబాద్రి, అనిల్, భాస్కర్, రాములు, నందమయ్య, భాస్కర్, సాయిలు పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత



సిరికొండ: మండలంలోని గడ్డమీది తండాకు చెందిన బానావత్ లలిత అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆమె కుటుంబ సభ్యులకు రూ.లక్ష విలువైన ఎల్వోసీని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేశ్, బాధితురాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే మానవ మనుగడకు మూలం



సమావేశంలో ఎఫ్‌పీవో చైర్మన్ నాగయ్య, డైరెక్టర్లు

డిచ్‌పల్లి: పర్యావరణ పరిరక్షణే మానవ మనుగడకు మూలమని, కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఇందూరు డిచ్‌పల్లి రైతు ఉత్పత్తి సంఘం (ఎఫ్‌పీవో) చైర్మన్ నాగయ్య పేర్కొన్నారు. గురువారం డిచ్‌పల్లిలోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశంలో వాహనాల సంఖ్య విపరీతంగా పెరగడం వల్ల కాలుష్యం కూడా పెరిగిపోయిందన్నారు. ప్రజలు కూడా నడకను పూర్తిగా మరిచిపోయి వాహనాల్లో తిరుగుతున్నారన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ నీళ్లు, కరెంట్, పెట్రోల్, ఆహారం పొదుపుగా వాడటం నేర్చుకోవాలన్నారు. వనరులను భవిష్యత్తు తరాల కోసం అందించాల్సిన బాధ్యత మనందరిపైన ఉంటుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. రైతులు కూడా పురుగు మందులు లేని పంటలు పండించే అలవాటు చేసుకోవాలని సూచించారు. ఇందూరు డిచ్‌పల్లి ఎఫ్‌పీవో డైరెక్టర్స్ వేల్పూర్ భూమయ్య, భూమారెడ్డి, సీఈవో అఖిల, అకౌంటెంట్ సాయినాథ్, రైతులు పాల్గొన్నారు.

భిక్షాటన చేసిన వీవోఏలు



సిరికొండ: ఉద్యోగ భద్రత కోసం చేపట్టిన సమ్మెలో భాగంగా ఐకేపీ వీవోఏలు సిరికొండ మండల కేంద్రంలో భిక్షాటన చేసి గురువారం నిరసన తెలిపారు. మండల కేంద్రంలో దుకాణాల వద్దకు వెళ్లి సమ్మె చేపట్టి 32 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో మా పూట గడవడం కోసం భిక్షాటన చేస్తున్నట్లు వారు వివరించారు. సంఘం మండలాధ్యక్షుడు మూన్‌సింగ్, సునీత, శ్యామల, రాంచందర్, లక్ష్మీ, స్వరూప, రాధ, పుష్ప, రాజేశ్వర్, వర్ష, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అర్గుల్ సర్పంచ్ దంపతుల వినూత్న ఆలోచన



ఖాతా ప్రతులను అందజేస్తున్న సర్పంచ్ దంపతులు

- వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బాలికలకు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు

జక్రాన్‌పల్లి: తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అర్గుల్ సర్పంచ్ గోర్త పద్మ రాజేందర్ దంపతులు వినూత్నంగా ఆలోచించారు. గ్రామంలోని 10 మంది బాలికలకు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరిపించారు. తమ సొంత ఖర్చులతో ఖాతాలు తెరిపించారు. ఈ ఖాతాలతో బాలికలకు ఎంతో మేలు జరుగుతుందని సర్పంచ్ పద్మ రాజేందర్ దంపతులు తెలిపారు. సర్పంచ్ దంపతుల ఆలోచన విధానం, పేద బాలికలకు ఉచితంగా ఖాతాలు తీయడం పట్ల పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు. సర్పంచ్ గోర్త పద్మ, ఉపసర్పంచ్ గోర్త రాజేందర్, అంగన్‌వాడీ టీచర్ గీత, బీపీఎం క్రితిక్‌గౌడ్, బాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



జక్రాన్‌పల్లి: గ్రామీణ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏఎస్సై సుశీల్ కుమార్ సూచించారు. గురువారం తొర్లికొండలో సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాలు, ట్రాఫిక్ నిబంధనలపై గ్రామస్తులకు పోలీసులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేష్, ఉపసర్పంచ్ భూమేశ్వర్, సొసైటీ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజమల్లు, వీడీసీ కార్యదర్శి జానకిరాం పాల్గొన్నారు.

స్థలాలున్న వారికి రుణాలివ్వండి



ఖలీల్‌వాడి: ప్రభుత్వం వెంటనే పేదలకు పట్టాలను మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణం కోసం రుణాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం గురువారం కొండం చెరువు కట్టపైన ఉన్న సర్వే నంబర్–171లో మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసి ఎర్రజెండాలను కట్టారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ.. ఇంటి స్థలాల కోసం పేదలందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్ద వెంకట రాములు, వెంకటేష్, గోవర్ధన్, నగర కార్యదర్శి సూరి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



అమూల్య



కృష్ణవేణి



మనీష్

పెర్కిట్(ఆర్మూర్)/జక్రాన్‌పల్లి/ఇందల్వాయి: ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అమూల్య జాతీయ స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మధు గురువారం తెలిపారు. ఇటీవల వరంగల్ జిల్లాలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో అమూల్య ప్రతిభ చూపిజాతీయ స్థాయి ఎంపికైనట్లు పీఈటీ తెలిపారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం హుగ్లీలో ఈ నెల 28నుంచి జూన్ ఒకటి వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు తెలిపారు. అలాగే జక్రాన్‌పల్లి మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన నాయిక మనీష్ జాతీయ స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ యాదగిరి తెలిపారు. ఇందల్వాయిలోని ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాల విద్యార్థిని కృష్ణవేణి అండర్–16 జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం



ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

నిజామాబాద్‌నాగారం: పర్యావరణ పరిరక్షణ కోసం పాటు పడాలని మున్సిపల్ ఆర్ఐ నరేందర్ ఎంహెచ్‌వో సాజిత్ అలీ కోరారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పర్యావరణాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. ఉద్యోగులు అందరూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నటరాజ్ గౌడ్, మహిపాల్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

ఆర్‌వోబీ–771పై బీటీ రోడ్డు



సుభాష్‌నగర్: ఆర్మూర్ మండలంలోని గోవింద్‌పేట్ ఆర్‌వోబీ–771పై ఎంపీ అర్వింద్ ధర్మపురి చొరవతో బీటీ రోడ్డు పనులు చేపట్టారు. మూడు నెలల క్రితమే ఆర్‌వోబీని ఎంపీ ప్రారంభించిన విషయం తెలిసిందే. కాంట్రాక్టర్ పనులు నాసిరకంగా చేపట్టడంతో మూడు నెలలకే కంకర తేలింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎంపీ అర్వింద్ సంబంధిత కాంట్రాక్టర్‌పై మండిపడ్డారు. వారం రోజుల్లోగా గోవింద్‌పేట్ ఆర్‌వోబీపై బీటీ రోడ్డు వేయాలని, లేకుంటే కఠినచర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. అదేసమయంలో రైల్వే అధికారులపై ఒత్తిడి పెంచారు. వారం రోజులుగా ప్రతిరోజు రైల్వే అధికారులు, కాంట్రాక్టర్‌తో సంప్రదిస్తూనే బీటీ రోడ్డు పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలకు స్పందించి ఆర్‌వోబీపై బీటీ రోడ్డు వేయించినందుకు ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యుత్ శాఖలో ఇష్టారాజ్యంగా పనులు

- డి–7 సెక్షన్ పరిధిలో 33 కేవీ లైన్ పనులు నిబంధనలకు విరుద్ధంగా చేసిన అధికారులు

నిజామాబాద్‌నాగారం: నగరంలో విద్యుత్ శాఖ పరిధిలో ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు. కనీస నిబంధనలు పాటించకుండా కాంట్రాక్టర్, ఓ ఏడీఈ పనులు చేపట్టారు. నగరంలోని డి–7 సెక్షన్ పరిధిలోని ఆర్యనగర్ సబ్ స్టేషన్ వెనుక ప్రాంతంలో సంజీవరెడ్డి కాలనీలో 33 కేవీ లైన్ల పనులు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారు. సుమారు రూ.10 లక్షల విలువ చేసే పనులు చేశారు. 5 స్తంభాలు కూడా వేశారు. అయితే సెక్షన్ ఏఈకి సమాచారం లేకుండా ఆ కాంట్రాక్టర్, ఓ ఏడీఈ పనులు చేపట్టినట్లు తెలిసింది. వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేసి జేబులు నింపుకొన్నట్లు బయటపడింది. నిబంధనల ప్రకారం 33కేవీ పనులు చేయాలంటే కచ్చితంగా వరంగల్ ఎన్పీడీసీఎల్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. గతంలో చాలాసార్లు 33కేవీ లైన్లు తొలగించాలని విన్నవించినా ఉన్నత అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు రాలేదు. కానీ ఏడీఈ, కాంట్రాక్టర్‌తో కలిసి అక్రమాలకు తెరలేపారు. ఈ విషయం కాస్త బయటకుపొక్కడంతో దిద్దుబాటు చర్యలకు పూనుకున్నారు.

పనులను నిలిపివేయించాం..

అనుమతి లేకుండా 33కేవీ లైన్ పనులు చేయడం నిబంధనలకు విరుద్ధం. పనులు చేసిన విషయం తెలుసుకొని నిలిపి వేయించాం. ఎలాంటి ఎస్టిమేషన్ లేకుండా పనులు చేయడం సరికాదు. దీనిపై ఉన్నత అధికారులకు విన్నవిస్తాం.

– అన్నయ్య, డీ–7 ఏఈ

కార్పొరేట్ పాఠశాల ఫ్లెక్సీల చించివేత



ఫ్లెక్సీలను చించివేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

నిజామాబాద్‌అర్బన్: నగరంలో నారాయణ కార్పొరేట్ పాఠశాల ఫ్లెక్సీలను గురువారం విద్యార్థి ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు చించివేశారు. సుభాష్‌నగర్‌లో ఇటీవల నారాయణ పాఠశాల నూతనంగా ప్రారంభమైంది. దీనికి అనుమతి లేదని విద్యార్థి నేతలు ఆరోపించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ.. నారాయణ విద్యాసంస్థ కనీస నిబంధనలు పాటించకుండా రాత్రికి రాత్రి ఫ్లెక్సీలు బ్రోచర్లతో ఎక్కడో వచ్చినా ర్యాంకులు, మార్కులను నిజామాబాద్‌లోని వని ప్రచారం చేస్తూ తల్లిదండ్రులను మోసం చేసి అడ్మిషన్లు చేస్తున్నారని అన్నారు. నిబంధనలు పాటించని పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. నాయకులు మహేష్ రెడ్డి పాల్గొన్నారు .

మహిళలపై హింస పెరిగింది



ఖలీల్‌వాడి: బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా మహిళలపై హింస పెరిగిందని, వీటన్నిటిని అరికట్టాలంటే రానున్న కాలంలో మహిళలంతా ఏకమై ఐక్య పోరాటం చేయడం వల్లనే సాధ్యమవుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పేర్కొన్నారు. నగరంలోని సీపీఎం ఆఫీస్‌లో ఐద్వా మహిళా సంఘం విస్తృత స్థాయి సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో రమేశ్‌బాబు మాట్లాడుతూ.. మనువాద సిద్ధాంతం ప్రకారం మహిళలను వంటింటికే పరిమితం చేసి పిల్లల కనే యంత్రంగా భావించే ధోరణితో నాయకులు ఉన్నారన్నారు. ఈ విధానానికి వ్యతిరేకంగా మహిళలందరూ పోరాటాలు చేయాలన్నారు. నూతన జిల్లా కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా అనిత, కార్యదర్శిగా బి.సుజాత, ఉపాధ్యక్షులుగా లావణ్య, బి.అనసూయ, సహాయ కార్యదర్శిగా షేక్ మీరా ఎన్నికయ్యారు.

మిషన్ భగీరథ పైపు లీకేజీ



లింగాపూర్ వద్ద ఎగసి పడుతున్న 'భగీరథ' నీరు

ఇందల్వాయి: మిషన్ భగీరథ నీటి సరఫరాలో నిత్యం ఏదో ఒక చోట లోపం బయటపడుతూనే ఉంది. గురువారం ఇందల్వాయి–ధర్పల్లి రోడ్డు మార్గంలో లింగాపూర్ గ్రామం వద్ద మిషన్ భగీరథ గ్రిడ్ పైపులైన్ లీకేజీ కావడంతో నీరు ఉవ్వెత్తున ఎగిసి పడింది. లీకేజీ అయిన ప్రతీసారీ కలుషిత నీరు సరఫరా అవుతుందనే విమర్శలున్నాయి. పంట పొలాల నుంచి ప్రధాన పైపు లైన్లు ఉన్నందున పంటలు ఉన్న సమయంలో లీకేజీ జరిగితే ఆ నీటి ధాటికి పంటలు కొట్టుపోయే ప్రమాదం ఉంటుందని, లీకేజీలు కాకుండా సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. లీకేజీ సమాచారం తెలుసుకున్న అధికారులు నీటి సరఫరా నిలిపివేసి మరమ్మతు పనులు చేపట్టారు.

నిశితలో క్యాంపస్ డ్రైవ్

నిజామాబాద్‌అర్బన్: నిశిత డిగ్రీ కళాశాలలో గురువారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా ఇందులో 68 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వివిధ కార్పొరేట్ సంస్థలు ఈ క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నికిల్, కో–ఆర్డినేటర్ రాజు, ప్రిన్సిపల్ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,300	వెండి (కిలో)	74,500
22 క్యారెట్స్	57,442	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	క్యాప్సికం	30	50
బెండకాయ	15	30	గాజరుగడ్డ	35	50
జీరకాయ	30	50	పచ్చిమిర్చి	50	70
దొండకాయ	15	30	దోసకాయ	20	40
బీర్నిసుకాయ	85	100	ఆలుగడ్డ	18	30
కాకరకాయ	40	60	గోబిగడ్డ	15	30
వంకాయ	30	50	గోబిపువ్వు	30	50
పాలకూర	50	70	బీట్‌రూట్	20	40
మెంతికూర	50	70	గోరు చిక్కుడు	45	70
కొత్తిమీర	45	60	చిక్కుడుకాయ	40	60
పుదీనా	30	50			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సెడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మేమ్ ఫేమస్ 10.30, 01.25 2018(తెలుగు) - 4.20, 10.20 బిచ్చగాడు-2 - 07.25
స్క్రీన్-2	కేరళ స్టోరీ (తెలుగు) -04.30 మళ్ళీ పెళ్లి-07.30-మేమ్ ఫేమస్ 10.30
స్క్రీన్-3	2018(తెలుగు) 10.30 మళ్లీ పెళ్లి 01.30-మేమ్ ఫేమస్-07.20 ఫాస్ట్ ఎక్స్ (తెలుగు- 3డీ) 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఫాస్ట్ ఎక్స్ (ఇంగ్లీష్- 3డీ) 10.30,7.10 2018(తెలుగు) 01.00,10.05 ఫాస్ట్ ఎక్స్ (తెలుగు- 3డీ) 04.10
స్క్రీన్-2	ది కేరళ స్టోరీ(ఇంగ్లీష్-3డీ)-10.40, 07.35 ది కేరళ స్టోరీ (తెలుగు) 01.35, 04.35 ఫాస్ట్ ఎక్స్ (తెలుగు- 3డీ) 04.10
స్క్రీన్-3	జేత్ర 11.05 మళ్లీ పెళ్లి 01.40,07.40 మేమ్ ఫేమస్ 04.30,10.30
స్క్రీన్-4	ది కేరళ స్టోరీ (తెలుగు) 10.35, మెంటో(తెలుగు) 01.35,10.00 2018(తెలుగు) 06.50
దేవి	బిచ్చగాడు2
నటరాజ్	మళ్లీ పెళ్లి
లలితామహల్	మేమ్ ఫేమస్
విజయ్	2018(తెలుగు)